

## నాణ్యతతో పనులు చేపట్టాలి

నేరడిగొండ: ఐటీడీఏ నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించాలని ఈఈ భీంరావ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు.



## పలు చెక్‌పోస్ట్‌ల తనిఖీ

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్ట్‌లను ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేకానంద శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 22న ఆదిలాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌కు హాజరు

కైలాస్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 22న జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.

### సంస్మరణ ఏర్పాట్లపై సమావేశం

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద శనివారం నిర్వహించనున్న సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని పీవీటీజీ ఏపీవో కుడ్మేత మనోహర్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివాసీ పెద్దలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లకయ్యే ఖర్చు ఐటీడీఏ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఆదివాసీ సంఘాల నాయకులు కనక తుకారాం, నాగోరావ్, నాగ్‌నాథ్ తదితరులున్నారు.

### మళ్లీ నిలిచిన థైరాయిడ్ పరీక్షలు



మొరాయించిన థైరాయిడ్ పరికరం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలోని టీ-హబ్ సెంటర్‌లో 57 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఏడు రకాల పరీక్షలు నిలిచిపోయాయి. ముఖ్యంగా థైరాయిడ్ పరీక్షలు చేయకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇందుకోసం రూ.600 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ మండలాలతో పాటు రిమ్స్‌కు రోజుకు 200 వరకు నమూనాలు వస్తాయి. పక్షం నుంచి ఈ పరీక్షలు నిలిచిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ పరికరం తరచూ మరమ్మతులకు గురవుతుండడం గమనార్హం.

# అమరం.. స్మరణం




- ఇంద్రవెల్లి ఘటనకు 43 ఏళ్లు
- ఎట్టకేలకు అమరులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు అమరవీరుల సంస్మరణ దినం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం

ఇంద్రవెల్లి: 1981 ఏప్రిల్ 20 జల్..జంగల్...జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ ఎక్కుపెట్టింది. తూటాల వర్షం కురిపించింది. హక్కుల సాధనలో 15 మంది గిరిజనులు అమరులయ్యారు. వారి రక్తపుటేరులతో తడిసిన పచ్చని వనం ఎరుపెక్కింది. అడవిబిడ్డల అమరత్వం నింగికెగిసిన అగ్ని శిఖలా ఇంద్రవెల్లిలో అమరుల స్తూపమై నిలిచింది. ఈ ఘటనకు 43 ఏళ్లు. అయితే ఇప్పటికీ ఆ స్తూపం వద్ద ఏటా ఆదివాసీలు స్వేచ్ఛగా నివాళులు అర్పించలేని పరిస్థితి. నాడు పూర్తిగా పోలీసు నిఘాలోనే స్తూపం ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2015లో తొలిసారిగా ఆంక్షలతో కూడిన అనుమతి ఇవ్వడంతో వందల మంది ఆదివాసీలు వచ్చి అమరులకు నివాళులర్పించారు. ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో కలెక్టర్, ఎస్పీకి పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు రెండు గంటల పాటు అనుమతి ఇచ్చారు. నాటి నుంచి ఆదివాసీలు సంప్రదాయ పూజలతో నివాళులర్పిస్తూనే ఉన్నారు. ఈసారి ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఆదివాసీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు. స్తూపం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఎట్టకేలకు స్మృతి వనం, ఇళ్ల స్థలాలు**

నాడు హక్కుల కోసం పోరాడిన ఆదివాసీలపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు గాయాలపాలయ్యారు. అయితే బాధిత కుటుంబాలను ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మూడేళ్ల క్రితం అమరుల కుటుంబాలను గుర్తించిన ఎంపీ సోయం బాపూరావు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పందించారు. పోలీస్ శాఖలో ఉన్న రికార్డుల ప్రకారం 15 మంది అమరవీరుల కుటుంబాలకు ఇటీవల మండలంలోని ముత్నూర్ సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. హక్కు పత్రాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. అమరవీరుల స్తూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దేందుకు రూ.97 లక్షలు కేటాయించారు.




స్తూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

**రెండోసారి స్మారక స్తూపం నిర్మాణం.**

ఆదివాసీల స్మారకార్థం రైతు కూలీ సంఘం ఇంద్రవెల్లిలో 80 అడుగుల స్తూపాన్ని నిర్మించింది. ఆ స్తూపాన్ని 1986 మార్చిలో గుర్తుతెలియని వ్యక్తులు డైనమేట్లతో పేల్చారు. గిరిజనుల ఆందోళనలతో 1987లో ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో రెండోసారి స్తూపం నిర్మించింది.

**పోలీసు బందోబస్తు..**

సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్సైలతోపాటు 100మందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

### 33 ఏళ్లుగా నివాళులకు దూరం

నాటి కాల్పుల ఘటన సాక్షిగా ఇంద్రవెల్లి సమీపంలో స్తూపం నిర్మించారు. ఆ రోజు నుంచి ఉమ్మడి రాష్ట్రం పాలన ముగిసే వరకు 33 ఏళ్లుగా అమరులకు నివాళులర్పించడానికి అనుమతి ఇవ్వలేదు. ఏటా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసే వారు. ఈ క్రమంలో 2004 అప్పటి బోథ్ ఎమ్మెల్యే సోయం బాపూరావ్ గిరిజన నాయకులతోపాటు అప్పటి ఎంపీ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏప్రిల్ 25న నివాళులర్పించారు. అప్పటి నుంచి ఏటా ఆదివాసీ గిరిజనులు అదే రోజున నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆదివాసీ సంఘాల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఆంక్షలు సడలించి స్తూపం వద్ద ఏప్రిల్ 20న నివాళులు అర్పించేందుకు రెండు గంటల సమయం ఇచ్చింది. దీంతో ఆదివాసీ సంప్రదాయ రీతిలో పూజలు చేసి నివాళులర్పిస్తున్నారు.

### అసలేం జరిగింది

స్వాతంత్ర్యం వచ్చి అప్పటికీ మూడున్నర దశాబ్దాలవుతున్నా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఈ క్రమంలో 1981లో చట్టబద్ధమైన హక్కుల సాధన కోసం పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో గిరిజన రైతు కూలీ సంఘం పేరిట ఇంద్రవెల్లిలో గిరిజన బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా ఆ రోజు సోమవారం వారసంత కావడంతో ఉదయం నుంచే ఆదివాసీలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల వరకే సభప్రాంగణం గిరి పుత్రులతో కిక్కిరిసిపోయింది. సభా స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా వినకుండా మరికొందరు గిరిజనులు ర్యాలీగా అక్కడికి బయలుదేరారు. వారిని అడ్డుకునే క్రమంలో ముందున్న గిరిజన యువతితో ఓ పోలీసు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె వెంటనే పోలీసుపై దాడి చేయగా ఆయన నెలకొరిగాడు. పరిస్థితి చేయిదాటి పోవడంతో పోలీసులు తూటాల వర్షం కుర్పించారు. రక్తం ఏరులై పారింది. ఈ ఘటనలో 15మంది ఆదివాసీలు మాత్రమే చనిపోయినట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. కానీ అప్పుడు తూటాల గాయాలతో తమ ఇళ్లకు వెళ్లి పోలీసుల భయంతో బయటకు రాలేక, వైద్యం అందక సుమారు 60 మంది వరకు చనిపోయినట్లు పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ తమ నివేదికలో స్పష్టం చేసింది.

### స్తూపాన్ని అభివృద్ధి చేయాలి



ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలను గుర్తించడం, స్మృతి వనం కోసం నిధులు మంజూరు చేయడం సంతోషకరం. అయితే స్తూపం వద్ద ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. అదనంగా ఎకరం కొనుగోలు చేసి స్మృతి వనం ఏర్పాటు చేయాలి.

– పుర్క బాపూరావ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

### నా భర్తను కోల్పోయిన..



నాటి ఘటనలో నా భర్త కొద్దు మరణించాడు. ఆ తరువాత కూలి పనులు చేసుకుంటూ నా కొడుకును పెంచి పెద్ద చేసిన. ఇప్పటి వరకు ఉండేందుకు ఇల్లు కూడా లేదు. ఇటీవల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. అయితే ఇందిరమ్మ నిధులతో ఇల్లు కట్టించి ఇవ్వాలి. ఐటీడీఏ ద్వారా రుణం అందించి నా కొడుకుకు ఉపాధి చూపాలి.

– సేడ్మకి లచ్చుబాయి, తాటిగూడ

### గాయంతో ఏ పని చేయలేను..



నాడు ఇంద్రవెల్లిలో వారసంత ఉండడంతో నా భర్త శంభుతో కలిసి వెళ్లిన. సంత నుంచి మిటింగ్‌కు వెళ్లినం. అక్కడ పోలీసుల కాల్పుల్లో నా కుడి చేయికి గాయమైంది. నా భర్త శంభు కూడా బుల్లెట్ల గాయంతో ఇంటికొచ్చి కొద్ది రోజుల తరువాత చనిపోయాడు. చేతి గాయం కారణంగా ఇప్పటికీ నేను ఎలాంటి పని చేయలేకపోతున్నా. ఉన్న ఒక్క కొడుకు కూడా అనారోగ్యంతో చనిపోయిండు. కోడలు వద్ద ఉంటున్న. ఆసరా పింఛన్ కూడా రావట్లేదు. కష్టంగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మడావి జంగుబాయి, కన్నాపూర్

## ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- ఎస్పీ గౌస్ ఆలం



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

బేల: ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారు 353బి జాతీయ రహదారి మార్గంలో గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి మద్యం, నగదు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇప్పటిదాకా రూ.50లక్షల వరకు నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ కమాండెంట్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్, జైనథ్ సీఐ సాయినాథ్, సివిల్ అధికారి సలావుద్దీన్ తదితరులున్నారు.

**రూ.50వేలు మించితే రశీదు తప్పనిసరి**

జైనథ్:రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణం చేసేవారు, నగదుకు సంబంధించిన రశీదులు వెంట ఉంచుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్ట్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సై పురుషోత్తం తదితరులు ఉన్నారు.

## రెండో రోజు ఒకే నామినేషన్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండోరోజు కొనసాగింది. శుక్రవారం ఒకే నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆ పార్టీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు తొలిసెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.

# అక్రమార్కుల్లో గుబులు

- గొర్రెల పంపిణీపై ప్రభుత్వం ఆరా
- జిల్లాలోనూ పెద్ద ఎత్తున రీసైక్లింగ్
- తప్పించుకునేందుకు యత్నాలు



| జిల్లాలో.. |
| --- |
| గొర్రెల పెంపకం సహకార సొసైటీలు 133 |
| మొత్తం సభ్యులు : 8,660 |
| తొలివిడత లబ్ధిదారులు 5,022 |
| రెండో విడత లబ్ధిదారులు : 567 |
| గొర్రెల పంపిణీ కోసం చేసిన ఖర్చు: రూ.73.22కోట్లు |

కైలాస్‌నగర్: గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బాధ్యులైన నలుగురు రాష్ట్రస్థాయి అధికారులపై ఇప్పటికే వేటు వేసిన సర్కారు తాజాగా జిల్లాల వారీగా పథకం అమలుకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. జిల్లాలోనూ ఈ పథకంలో అనేక అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసినట్లుగా చూపి వాటిని రీసైక్లింగ్ చేశారు. కొన్ని చోట్ల అధికారులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు సైతం అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా ప్రభుత్వం ఇలాంటి సమాచారాన్ని సేకరిస్తుండటంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. తాము చేసిన తప్పులను ఎలా కప్పిపుచ్చుకోవాలి, ఈ గండం నుంచి ఎలా బయటపడాలనే దిశగా ముమ్మర యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా అధికారులు పారదర్శక నివేదిక పంపితే పలువురిపై వేటుపడే అవకాశం లేకపోలేదని ఆ శాఖ అధికారులే చెబుతుండటం గమనార్హం.

**భారీగా అక్రమాలు....**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18ఏళ్లపైబడిన వారికి గొర్రెలను అందించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం తహసీల్దార్, ఎంపీడీవో, మండల పశువైద్యాధికారి సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. వీరి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు గొర్రెలను కొనుగోలు చేశారు. యూనిట్‌కు 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలును అందించారు. జిల్లాకు అవసరమైన గొర్రెలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్, కర్నూల్, కృష్ణ తదితర జిల్లాల నుంచి తెప్పించారు. వీటి సరఫరా నుంచి లబ్ధిదారులకు చేర్చే వరకు పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఒక్కో కుటుంబంలో నలుగురైదురికి గొర్రెలను అందజేశారు. ఇలా గొర్రెలు రావడమే ఆలస్యం వాటిని లబ్ధిదారులకు ఇచ్చినట్లుగా చూపించి రీసైక్లింగ్ చేశారు. ఒక చోట ఇచ్చిన వాటినే మరో చోటకు తరలించి అక్కడ ఇలాగే వ్యవహరించారు. మరికొన్నిచోట్ల జిల్లాకు తీసుకువచ్చిన వాటిని లబ్ధిదారులు ఫొటోలు దిగేంతవరకు ఉంచి తిరిగి వాటిని కాంట్రాక్టరే మరో జిల్లాకు తీసుకెళ్లారు. ఇలా విక్రయించిన గొల్ల, కుర్మలకు వారు చెల్లించిన డీడీల కంటే రూ.20వేలు, 30వేలు ఎక్కువ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో లబ్ధిదారులు నష్టపోగా కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయనే విమర్శలు వ్యక్తమయ్యాయి. పలు చోట్ల గొర్రెలను అమ్ముకున్నారు. ఈ వ్యవహారంలో గొర్రెలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్లతో పాటు మండల పశు వైద్యాధికారులు సైతం భాగస్వాములయ్యారనే విమర్శలు అప్పట్లో పెద్ద ఎత్తున వినిపించాయి.

**సర్కారు ఆరాతో గుబులు**

గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించిన ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రస్థాయిలో బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టిన సర్కారు తాజాగా జిల్లాల వారీగా సమాచార సేకరణపై దృష్టిసారించింది. ఎంత మందికి గొర్రెలను పంపిణీ చేశారు.. లబ్ధిదారుల వివరాలు.. వారి బ్యాంకు ఖాతాలు, గొర్రెలను ఎక్కడ కొనుగోలు చేశారు.. వాటిని తరలించిన కాంట్రాక్టర్.. అధికారులు వాటికి చేసిన చెల్లింపులు.. బ్యాంకు ఖాతాలు వంటి సమగ్ర సమాచారాన్ని పంపించాల్సిందిగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు మండలాల వారీగా వివరాలు సేకరిస్తుండటంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

### వివరాలు పంపుతున్నాం



2017లో గొర్రెల పంపిణీ ప్రారంభం నుంచి మొదటి విడత పూర్తయ్యే వరకు పంపిణీ చేసిన గొర్రెలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. మండలాల వారీగా సేకరిస్తున్నాం. వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– బి.కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

## ఆత్రం సుగుణ ఆస్తులు రూ.54.60 లక్షలు

- అఫిడవిట్‌లో వివరాలు వెల్లడించిన కాంగ్రెస్ అభ్యర్థి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ లక్షాధికారే. శుక్రవారం ఆమె తరఫున దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లో తనకున్న ఆస్తులతో పాటు అప్పుల వివరాలు పేర్కొన్నారు. చరాస్తులు రూ.12లక్షల 10వేలు ఉండగా, తన భర్త భుజంగ్‌రావు పేరిట రూ.42వేలు ఉన్నట్లుగా తెలిపారు. స్థిరాస్తులు తన పేరిట రూ.42లక్షల 50వేలు ఉన్నాయి. అలాగే తన పేరిట వివిధ బ్యాంకుల్లో రూ.23లక్షల 49వేల 224 అప్పులు ఉండగా, తన భర్త పేరిట రూ.29లక్షల 76వేల 946 అప్పు ఉన్నట్లుగా వెల్లడించిన ఆమె తనకు సొంత వాహనం లేనట్టుగా పేర్కొన్నారు. కాగా తనపై ఉద్యమ కాలం నాటికి సంబంధించి 50 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

## తొలి ఎంపీ.. సి.మాధవరెడ్డి



- హైదరాబాద్ రాష్ట్రంలో మొదటి ఎన్నికలు
- సోషలిస్టు పార్టీ తరఫున ఆదిలాబాద్ నుంచి పోటీ
- 25వేల ఓట్ల అధిక్యంతో విజయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. మహారాష్ట్ర, కర్నాటకలోని పలు ప్రాంతాలను కలుపుకుని హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో ఏర్పడిన ఈ నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేది. అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంలో 21 ఎంపీ స్థానాలు ఉండగా అందులో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఒకటి. ఈ నియోజకవర్గానికి 1952 మార్చి 27న తొలి సారిగా సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇందులో సోషలిస్టుపార్టీ సత్తా చాటింది. ఆ పార్టీ తరఫున సి.మాధవరెడ్డి పోటీ చేయగా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా జేవీ నర్సింగ్‌రావు బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,51,017 మంది ఓటర్లున్నారు. కాగా తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అంతగా అవగాహన లేకపోవడంతో సగానికిపైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగానికి దూరంగా ఉన్నారు. తొలిసారి గా జరిగిన ఎన్నికల్లో 1,56,907 (44.7శాతం)ఓట్లు పోలయ్యాయి. 1,94,110 మంది ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. కాగా ఆ రోజుల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతీ ఓటు చెల్లుబాటు కావడం గమనార్హం.

**తొలి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు..**

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన తొలి ఎన్నికల్లో చెరుకు మాధవరెడ్డి ఎంపీగా విజయం సాధించి రికార్డు సృష్టించారు. సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసిన ఆయనకు 90,995 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి నర్సింగ్‌రావుకు 65,912 ఓట్లు పోలయ్యాయి. దీంతో మాధవరెడ్డి 25,083 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన కాంగ్రెస్, టీడీపీల నుంచి కూడా పదవులు దక్కించుకున్నారు. ఆయన రాజకీయ జీవితం మూడు పార్టీల్లో సాగింది. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 1962లో బోథ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరిన ఆయన రెండోసారి 1984లో మరోసారి ఎంపీగా విజయం సాధించారు.

## ఎన్నికల వ్యయం పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేకానంద



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న వివేకానంద, పక్కన కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం

కైలాస్‌నగర్: ఎన్నికల ప్రచారానికి పార్టీ ద్వారా, అభ్యర్థి తరఫున ఖర్చుచేసే ప్రతీ పైసా ఎన్నికల వ్యయం కింద నమోదు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు జాదావార్ వివేకానంద అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్ నుంచి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ అకౌంటింగ్ టీం సభ్యులు సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అనుమానాస్పద బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాలన్నారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో చేసిన ప్రకటనలకు ఈసీ విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయంగా నమోదు చేయాలన్నారు. అలాగే రోజువారిగా దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు అశిష్ సంగ్వాన్, వెంకటేష్ దోత్రే, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రిమ్స్ నుంచి రోగి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి అదృశ్యమైనట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జైనూర్ మండలం మర్కగూడ గ్రామానికి చెందిన మడావి అయ్యురాం ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో రిమ్స్‌లో చేరాడు. అప్పటికే చికిత్స అందించిన వైద్యులు ఆయనను వేరే గదిలోకి మార్చారు. ఈ క్రమంలో ఆయన కుటుంబీకులు ఆయన వస్తువులు తీసుకురావడానికి వెళ్లగా ఆయన ఈ నెల 13న ఆస్పత్రి నుంచి కనిపించకుండా పోయాడు. బాధితుడి తండ్రి తుకారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### సివిల్స్ ర్యాంకర్ శుభంకు ఘన స్వాగతం



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న శుభం

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన యూపీఎస్సీ సివిల్స్ ర్యాంకర్ రేకుల్‌వార్ శుభంకు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాంకు సాధించిన తర్వాత మొదటిసారిగా వచ్చిన ఆయనను సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతించారు. ముందుగా కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శాలువలతో సన్మానం చేసి మిఠాయిలు తినిపించారు. సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన శుభంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

### వివాహిత ఆత్మహత్య



మల్లవ్వ మృతదేహం

సారంగపూర్: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన వివాహిత బండారి మల్లవ్వ(28) సంతానం కలగడం లేదని శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కుప్టి గ్రామానికి చెందిన సురేశ్‌తో మల్లవ్వకు 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం కాకపోవడంతో మనోవేదనకు గురైంది. ఇక సంతానం కలగదేమోనని మనస్తాపం చెందింది. ఈ క్రమంలో ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారస్థితికి చేరుకుంది. గమనించిన భర్త సురేష్ హుటాహుటిన నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లవ్వ మృతిచెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### గుర్తు తెలియని శవం లభ్యం

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి గ్రామ శివారులో పల్సికర్ రంగారావుప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై డ్రాయర్ తప్ప ఎలాంటి దుస్తువులు లేవని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185038]

■ మీ గ్రామం / పట్టణంలోనే ఉంటూ అదనపు ఆదాయం కొరకు కొద్దిపాటి పెట్టుబడి పెట్టగలిగి పార్ట్ టైం మార్కెటింగ్ చేయగలవారు సంప్రదించండి. R.V.మార్కెటింగ్ ఏజెన్సీస్, Hyd. 72 888 555 69 [G-672921]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

# కష్టాల జీవనం.. పూదోటతో ఆదాయం



చామంతి పూలను తెంపుతున్న సుశీల

- అర ఎకరంలో చామంతి తోట
- రోజూ 15 కిలోల చొప్పున విక్రయం
- వచ్చే ఆదాయంలోనే జీవనం
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళ

లక్ష్మణచాంద: ఒడిదుడుకుల ప్రయాణమే జీవితం. ఈ ప్రయాణంలో ఎదురయ్యే ఆటకంగాలను అధిగమిస్తేనే ముందుకుసాగుతాం. లేదంటే అక్కడే ఆగిపోతాం. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా.. ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తోంది మహిళా రైతు సుశీల. అర ఎకరంలో చామంతి పూలు సాగుచేస్తూ కొడుకును ఉన్నత చదువులు చదివిస్తూ జీవనం సాగిస్తోంది.

**చామంతిపూల సాగు..**

లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ గ్రామంలోని తమ ఎకరం వ్యవసాయ భూమిలో అర ఎకరంలో సుశీల ఏడాదిగా చామంతి పూలు సాగు చేస్తోంది. హైబ్రిడ్ రకం పూలను పండిస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తోంది. ఉదయం 6:30 గంటలకే ఇంట్లో పనులు ముగించుకుని 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాపూర్‌కు చేరుకుంటుంది. తోటను చూసుకుని, నీటిని అందించి పూలను తెంపి బస్సులో తీసుకుని నిర్మల్‌కు వెళ్తుంది. నిర్మల్‌లో వ్యాపారులకు వాటిని విక్రయించి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటుంది. నిత్యం 15 నుంచి 20 కిలోల పూల దిగుబడి వస్తుందని వీటిని విక్రయించడం ద్వారా రూ.750 నుంచి రూ.1000 ఆదాయం వస్తుందని సువీల తెలిపింది. ఈ ఆదాయంతోనే తాను జీవనం సాగిస్తూ కొడుకు నిఖిల్‌ను బీటెక్ చదివిస్తోంది.

**గతంలో భర్తకు చేదోడుగా..**

నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పట్టేరి గణేశ్–సుశీల దంపతులు. వీరిది మధ్యతరగతి కుటుంబం. వీరికి కూతురు, కొడుకు సంతానం. గణేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూనే తనకున్న ఒక ఎకరంలో వ్యవసాయం చేసేవాడు. సుశీల వ్యవసాయ పనుల్లో భర్తకు చేదోడుగా ఉండేది. గతేడాది కూతురుకు వివాహం కూడా చేశారు. సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా కుదుపు. గణేశ్ గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో కుటుంబ భారాన్ని తనపై వేసుకుంది సుశీల. కొడుకును ఉన్నత చదువులు చదివించాలన్న లక్ష్యంతో వ్యవసాయం చేసే బాధ్యతను తన భుజాలపై వేసుకుంది.

# పేదింటి ఆడబిడ్డను పార్లమెంట్‌కు పంపండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కైలాస్‌నగర్: జిల్లా చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా ఆదివాసీ పేదింటి బిడ్డ ఆత్రం సుగుణకు ఎంపీ టికెట్ కేటాయించిందని, ప్రజలు తమ ఆడపడుచుగా భావించి ఆమెను పార్లమెంట్‌కు పంపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. ఆమె తరపున నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 17స్థానాలకు గాను 15 స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మతం, దేవుళ్ల పేరిట రాజకీయాలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వంలా అందరూ కలిసిమెలిసి ఉండాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. గతంలో ఆరు గ్యారంటీలు, ప్రస్తుతం ఐదు న్యాయసూత్రాలతో ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేశారు. పేద కుటుంబానికి చెందిన సుగుణ కుటుంబం ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. అందుకే ఆమె సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశమిచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆమెను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, శ్రీలేఖ, న్యాయవాది అఫ్రోజ్, తదితరులున్నారు.

## వడదెబ్బతో ఒకరి మృతి



మృతిచెందిన లక్ష్మీనర్సయ్య (ఫైల్)

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన రామగిరి లక్ష్మీనర్సయ్య(53) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వడదెబ్బ తగలడంతో రెండు రోజులుగా వాంతులు, విరోచనాలు అవుతున్నాయి. శుక్రవారం సైతం పనిచేస్తూ వీరేచనాలు చేసుకుని, కుప్పకూలిపోయాడు. గ్రామంలో ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. లక్ష్మీనర్సయ్యకు భార్య గంగభవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ముగిసిన సుమన అంత్యక్రియలు



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి అంజనాబాయి

బజార్‌హత్నూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు, ప్రత్యేక పోలీసు బలగాల మధ్య ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం డేడ్ర గ్రామానికి చెందిన మావోయిస్టు దాసర్వడ్ సుమన అలియాస్ రంజిత మృతదేహానికి శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ రీజియన్ కంకేర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఇందులో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన మావోయిస్టు సిరిపెల్లి శంకర్‌రావ్ మృతదేహంతో పాటు అతడి భార్య సుమన అలియాస్ రంజిత మృతదేహం ఉండటంతో శంకరావు కుటుంబసభ్యులు రెండు మృతదేహాలను ఒకే చోట ఖననం చేస్తామని విన్నవించారు. ఈ మేరకు వారికి శంకర్‌రావు, రంజితల మృతదేహాలను అప్పగించారు. విషయం తెలుసుకున్న రంజిత తల్లి అంజనాబాయి గురువారం రాత్రి తన సమీప బంధువుతో కలిసి అక్కడికి చేరుకుంది. బిడ్డ మృతదేహం ఉన్న శవపేటికమీద పడి బోరున విలపించింది. అనంతరం రెండు మృతదేహాలను ఖననం చేశారు. రంజిత మూడు దశాబ్దాల మావోయిస్టు ప్రస్థానం ముగిసినట్లయింది.

# సరస్వతి కాలువలో పడి మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో ఓ మహిళ ప్రమాదవశాత్తు సరస్వతి కాలువలో పడి మృతిచెందింది. ఎస్సైశ్రీకాంత్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండారపు లక్ష్మి(53) పొలం పనుల కోసం ఉదయం వెళ్లింది. 11 గంటల సమయంలో పనులు ముగించుకుని సమీపంలోని సరస్వతి కాలువలో కాళ్లు శుభ్రం చేసుకోవడానికి దిగింది. ప్రమాదవశాత్తు జారి కాలువలో పడిపోయింది. ఈత రాకపోవడంతో నీటిలో మునిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. కాలువలో మృతదేహం లభించింది. లక్ష్మి భర్త గుండారపు రాజేశుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో డిప్యూటీ తహసీల్దార్, సీఐ



పట్టుకున్న నగదుతో అధికారులు

నార్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని రాజులగూడ గ్రామం వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుకున్నట్లు తనిఖీ బృందం సభ్యుడు డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్ తెలిపారు. గంగాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అశ్విన్ మండల కేంద్రంలోని వైన్స్‌లో పనిచేస్తున్నాడు. గంగాపూర్ నుంచి స్కూటీపై నార్నూర్ వైపు వస్తుండగా తనిఖీ చేయగా అతడి వద్ద ఉన్న బ్యాగు లభించింది. అందులో రూ.5,98,660 నగదు ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడతో ఆ మొత్తాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీఐ రహీం పాషా, ఎస్సై రవికిరణ్ సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.

**రోల్‌మామడ వద్ద రూ.5లక్షల 17వేల నగదు..**

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని రోల్‌మామడ వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టోల్‌ప్లాజా వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.5లక్షల 17వేల నగదు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా తనిఖీ చేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1.50 లక్షలు పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రవీందర్ తెలిపారు. నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నర్సయ్య నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుని జగిత్యాలకు వెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పెళ్లికి అవసరమైన బంగారం కొనుగోలుకు డబ్బులు తీసుకెళ్తున్నట్లు నర్సయ్య చెప్పినా.. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో టీం సిబ్బంది దేవ్, ముజీబుద్దీన్, ముఖీద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# కేజీబీవీలో మళ్లీ ఫుడ్ పాయిజన్

- 11 మంది విద్యార్థినులకు అస్వస్థత
- నర్సాపూర్ (జి)లో ఘటన



నర్సాపూర్ (జి) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం మళ్లీ ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో 11 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను నర్సాపూర్(జి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రాత్రి భోజనంలో పప్పు, వంకాయ కూర తిన్నామని, కొద్దిసేపటికే కడుపు నొప్పి, వాంతులు కావడంతో ఏఎస్ఎంకు సమాచారం ఇచ్చామని విద్యార్థినులు తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. అస్వస్థతకు గురైన వారిలో 6, 8వ తరగతి విద్యార్థినులు ఉన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినుల తల్లిదండ్రులకు ఇన్‌చార్జి ఎస్‌వో వనిత సమాచారం అందించారు. 8 మందిని చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ముగ్గురు విద్యార్థినులకు కడుపునొప్పి తగ్గకపోవడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## అసభ్యకర పోస్టుపై కేసు

రామకృష్ణాపూర్: సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టిన పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి రాజేష్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఒకరి మనోభావాలు దెబ్బతీసేలా ఎవరూ పోస్టులు చేయొద్దని, ఎన్నికల నేపథ్యంలో సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# జీయర్ గురుకులం విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి

- శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి
- అల్లంపల్లిలో ఆలయాలు, కళాశాల భవనం ప్రారంభం



మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి



వేడుకలకు హాజరైన ప్రజలు

కడెం: అల్లంపల్లి జీయర్ గురుకులం విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి సూచించారు. కడెం మండలం అల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వామివారు తీర్థప్రసాదాలను అందజేశారు. చినజీయర్ స్వామి 2004లో అల్లంపల్లి గ్రామంలో జీయర్ గురుకులం ఏర్పాటు చేయగా, విద్యార్థులు పదో తరగతి వరకే చదివి, ఉన్నత చదువులకు దూరమవుతున్నారని గ్రామస్తులు స్వామి వారి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటర్మీడియెట్ కోసం జీయర్ జూనియర్ కళాశాల భవనం ప్రారంభించారు. అనంతరం జీయర్‌స్వామి ట్రస్మా నాయకులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు పాఠాలతోపాటుగా, వ్యక్తిగత విలువలు నేర్పించాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై మాట్లాడారు. జీయర్ స్వామి మారుమూల గ్రామంలో గురుకులం ఏర్పాటు చేసి విద్యనందించడం గొప్ప విషయమన్నారు. మారుమూల అల్లంపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో ఆదిలాబాద్, ఆశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ఆదినారాయణరావు, జెట్ చైర్మన్ ప్రభాకర్‌రావు, శాంతారాం స్వామిజీ, జీయర్ గురుకులం హెచ్‌ఎం చక్రధర్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిపై కోడ్ ఉల్లంఘన కేసులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్‌లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్‌లు రాజకీయంగా మాట్లాడడంతో పాటు కార్యకర్తలను కాపాడుకుంటామని ప్రసంగించారని తెలిపారు. వీడియో సర్వేలెన్స్ టీమ్ అధికారి శేషారావు ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్ నుంచి నేతాజీచౌక్ వరకు, అలాగే అంబేద్కర్ చౌక్‌లో రాముని ఫొటోతో పాటు కింది భాగంలో ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు చేయడంతో ఎన్నికల ఉల్లంఘన కింద ఎమ్మెల్యేపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## హోంగార్డుపై కేసు



షమీ ఉల్లాఖాన్ షకీల్

నిర్మల్‌టౌన్: మోసం చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్న హోం గార్డ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ అనిల్ తెలిపారు. షమీ ఉల్లాఖాన్ షకీల్ అనే హోంగార్డ్ నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కొన్ని రోజుల క్రితం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తు ఉండేవాడు. ఆ సమయంలో పట్టణంలోని పలువురితో పరిచయాలు పెంచుకుని తక్కువ ధరకు భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రి ఇప్పిస్తానని నమ్మించి పట్టణానికి చెందిన పలువురు నుంచి డబ్బులు వసూలు చేశాడు. సామగ్రి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





గాయాలపాలైన సంజీవ్‌రావు, మాధవ్‌రావు

భైంసారూరల్: మండలంలోని మాంజ్రీ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు, ద్విచక్ర వాహనం భైంసావైపుకు వస్తున్నాయి. ద్విచక్రవాహనాన్ని కారు వెనుకవైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు కింద పడి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో వాగ్మారే సంజీవ్ మహారాష్ట్రలోని నయాగావ్ గ్రామస్తుడు. మాధవ్‌రావు బాసరకు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. ఈమేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

# బాధను పంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులతో కార్పొరేట్ ట్రైనర్ తిరుమల్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ వెంకటరమణ

భైంసా: విద్యార్థులు అన్ని విషయాలను అధ్యాపకులతో పంచుకోవాలని కార్పొరేట్ ట్రైనర్ తిరుమల్ రెడ్డి సూచించారు. ట్రిపుల్‌ఐటీలో స్టూడెంట్ మెంటరింగ్ ప్రొగ్రాంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడంలో క్యాంపస్ అధికారులు దృష్టిపెట్టాలన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనావేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. తక్కువ హాజరుశాతం ఉండే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని తెలిపారు. విద్యార్థులతో తమ వ్యక్తిగత సమస్యలను, అనుభవాలను పంచుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. విద్యార్థుల విశ్వాసాన్ని కొనసాగించేందుకు వారితో సన్నిహితంగా మెలగాలని సూచించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ట్రైనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మహేశ్, కోఆర్డినేటర్లు, అసోసియేషన్ డీన్‌లు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్
- తోషంతండా, డోంగర్‌గావ్ గ్రామాల సందర్శన



మహిళతో మాట్లాడుతున్న ప్రశాంత్‌జీవన్ పాటిల్

గుడిహత్నూర్: గ్రామాల్లో నీటి ఎద్దడి తలేత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తోషంతండా, డోంగర్‌గావ్ గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తాగునీటి వసతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటిని అందిస్తుందన్నారు. అయితే కొందరు అపోహల కారణంగా ఆ నీటిని తాగునీటికి వినియోగించడం లేదన్నారు. నీరు కలుషితంగా కనిపిస్తే వెంటనే పంచాయతీ అధికారులు, ఎంపీడీవోకు సమాచారం అందించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బావులు ఎండిన చోట సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి నీరు సరఫరా చేయాలన్నారు. ఒకవేళ ఈ సౌకర్యం కూడా లేనట్లయితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్, ఈఈ చంద్రమోహన్, నీటిపారుదల శాఖ ఎస్ఈ విఠల్, డీఎల్పీవోలు ఫణిందర్, ప్రభాకర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

- సీఎంకు పోస్టుకార్డులు రాసిన పొచ్చర గ్రామస్తులు



పోస్టుకార్డులతో పొచ్చర గ్రామస్తులు

నేరడిగొండ(బోథ్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ లు ఏమయ్యాయని బోథ్ మండలం పొచ్చర గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం పోస్టుకార్డులను ముఖ్యమంత్రికి పోస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పుడని ప్రశ్నించారు. ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, వృద్ధాప్య పింఛన్ నెలకు రూ.4వేలు ఎప్పుడు అమలు చేస్తారని పేర్కొన్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.2500, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తూ పోస్ట్‌కార్డులు రాసినట్లు పేర్కొన్నారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు సుభాష్, బుచ్చన్న, వెంకటరమణ, సమేందర్ రెడ్డి, రాజు, గ్రామస్తులు వెంకటరమణారెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.